సూర్య
www.suryaa.com
18వ వసంతంలోకి...






మంగళవారం 8, అక్టోబర్ 2024 | 8 పేజీలు




# నెంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేస్తాం

- నేరాలు అరికట్టడమే పోలీసుశాఖ లక్ష్యం
- ట్రాఫిక్ నియంత్రణ కోసం నిరంతరం తనిఖీలు
- 60 బుల్లెట్ వాహనాల సీజ్
- విలేకరుల సమావేశంలో డిఎస్పి అబ్దుల్ రెహమాన్

**కొత్తగూడెం క్రైం, సూర్య (మేజర్‌న్యూస్)** – కొత్తగూడెం పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం ట్రాఫిక్ పోలీసులు నిరంతరం దశలవారీగా తనిఖీలు చేపడుతున్నారని, నేరాలను అరికట్టడమే లక్ష్యంగా నెంబర్‌ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేస్తామని కొత్తగూడెం డీఎస్పి అబ్దుల్ రెహమాన్ హెచ్చరించారు.

2లో



# కాకతీయుల చరిత్రకు నిలువెత్తు రూపం పాపకొల్లు

- సజీవ సాక్ష్యంగా పురాతన కట్టడాలు వారసత్వ ప్రతిరూపాలు
- కథలు కథలు గా చెప్పుకుంటున్న రాజా బావి కథ
- పాపకొల్లులో ఉమా సోమలింగేశ్వర శివాలయం,
- పుట్టకోటలో సైనిక పటాలం కోసం కోట గోడలు
- బేతాళ పాడు వద్ద సోమయ్య లోద్ది దేవాలయం శత్రువుల రాకను వీక్షించేందుకు అనువైన నిర్మాణం
- కాకతీయుల కాలంలో పది వేల ఎకరాల సాగు కోసం పోలారం ప్రాజెక్ట్ నిర్మాణం
- కనకగిరి కొండలపై వీరభద్ర స్వామి ఆలయం, సూరారం కొండపై పల్లాల బావి నిర్మాణం
- మండలంలో కాకతీయ కళా వైభవ చిహ్నాలు చరిత్రకు రుజువులు
- ఓరుగల్లు కేంద్రంగా తెలుగు నేలను పరిపాలించిన కాకతీయ రాజులను గుర్తుచేసుకుందాం.



**జూలూరుపాడు, సూర్య(మేజర్ న్యూస్)** - ప్రతి మనిషికి సొంత ఇల్లు లేకపోవచ్చు,సొంత భూమి లేక పోవచ్చు కాని ప్రతి మనిషికి సొంత ఊరు ఉంటుంది భయ్యా ఇది ఒక సినిమాలో డైలాగ్ ఇది అక్షరాల నిజం.అలాంటి సొంత ఊరికి ఉన్న చరిత్రలోకి తొంగి చూసి నాటి చరిత్ర,చెక్కుచెదరని జ్ఞాపకాలను నెమరు వేసుకుందాం. జూలూరుపాడు ప్రాంతంలో కాకతీయుల కాలం లో నిర్మించిన పురాతన కట్టడాలను బట్టి సుమారు వెయ్యి సంవత్సరాల చరిత్ర మన కళ్ల ముందు కదలాడుతుంది.ఆ విశేషాలు ఒక సారి పరిశీలిద్దాం. జూలురుపాడు మండలం భౌగోళికంగా ప్రత్యేకంగా ఉంటుంది. పాపకొల్లు గ్రామం వెలుపల దండ్యాల చెరువు కట్ట పై నుంచి చూస్తే,మూడు వైపుల గుట్టల వరసతో కోట గోడల మాదిరిగా కనిపిస్తుంది.తూర్పున చంద్రుగొండ మండలాన్ని వేరుచేస్తూ, దక్షిణాన ఏన్కూర్ మండలం కేసుపల్లి మీదుగా,పడమర దిక్కున కామేపల్లి, కారేపల్లి మండలం చీములపాడు, ఉత్తరాన టేకులపల్లి మండలం తడికలపుడి, బేతంపూడి గ్రాముల ను వేరు చేస్తూ సుమారు 50కి. మీ పైచిలుకు దూరం వ్యాపించిన కొండల శ్రేణుల వలన భౌగోళికంగా మండలం ప్రత్యేకతను సంతరించుకుంది. 8వ పేజీలో...

## విద్యుత్ శాఖ మంత్రి సొంత జిల్లాలో
# విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం





- మొన్న జల్లి రాము... నిన్న గూని ప్రసాద్... ౧
- రేపు ఎవరో.....?
- పిట్టలా రాలిపోతున్న రైతుల ప్రాణాలు....
- నరసింహపురంలో జరిగిన ఘటన మరువకముందే లచ్చగూడెంలో కరెంట్ షాక్‌తో ప్రాణాలు కోల్పోయిన రైతు!
- ఘటనకు కారణమైన ఏ ఈ, ఎల్ ఎం లపై చర్యలు ఉంటాయా.. లేదా..?

2లో



## కంట్రోల్ బియ్యంపై
# నిఘా కంట్రోల్ తప్పిందా ?

**తిరుమలాయపాలెం, సూర్య మేజర్ న్యూస్** : దాడులు చేసినా డోంట్ కేర్.. పేదల బియ్యంతోనే అక్రమ వ్యాపారం తిరుమలాయపాలెం మండలంలో యధేచ్ఛగా అక్రమ బియ్యం వ్యాపారం సాగుతోంది. ఒకటి కాదు.. రెండు కాదు.. ఎన్నిసార్లు దాడి చేసినా వారి తీరు మారడం లేదు. చట్టంలోని లొసుగులను అడ్డం పెట్టుకుని అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఏటా కోట్లాది రూపాయల రేషన్ బియ్యం తరలిస్తున్నా.. అధికారులు మాత్రం మొక్కుబడి తనిఖీలతో సరిపెడుతున్నారు..ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఎన్నిసార్లు దాడులు చేసి అక్రమ బియ్యం దందాను అడ్డుకుందామన్నా ఫలితాలనివ్వడం లేదు. చిన్న కేసుల మూలంగా తేలికపాటి జరిమానాలు, శిక్షలను విధించడంతో పట్టుకున్న కొద్దిరోజులకే బయటకు వచ్చేస్తున్నారు.

2లో

# అంతరాష్ట్ర దొంగల అరెస్టు

## మీడియా ముందు హాజరు పరిచిన డిఎస్పీ



**అశ్వారావుపేట సూర్య, మేజర్‌న్యూస్** :పలు చోట్ల దొంగతనాలకు పాల్పడుతూ, పలు కేసుల్లో నిందితులుగా ఉన్న వ్యక్తులను అశ్వారావుపేట పోలీస్‌లు అరెస్టు చేశారు. ఈ మేరకు నిందితులను స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద డిఎస్పీ సతీష్‌కుమార్ మీడియా ముందు హాజరు పరిచారు. వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం జంగారెడ్డిగూడెం రోడ్‌లోని సాయిబాబ దేవాలయం సమీపంలో పోలీస్‌లు వాహన తనిఖీలు చేస్తుండగా ద్విచక్రవాహనం వెళ్తున్న ఇద్దరు అనుమానితులు అదుపులోకి తీసుకొని విచారించారు.

2లో

సూర్య
www.suryaa.com
మంగళవారం 8, అక్టోబర్ 2024

# నెంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేస్తాం

మొదటి పేజీ తరువాయి



సోమవారం కొత్తగూడెం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పి ఆదేశాల మేరకు కొత్తగూడెం ట్రాఫిక్ పోలీసుల సారధ్యంలో ప్రజలకు ఎన్నో ఆటంకాలు కలిగిస్తూ పెద్ద పెద్ద శబ్దాలను చేస్తూ తిరుగుతున్న బుల్లెట్ వాహనాలను పట్టుకున్నామని తెలిపారు. ట్రాఫిక్ ఎస్సై నరేష్ నేతృత్వంలో దశలవారీగా చేపడుతున్న తనిఖీల్లో భాగంగా నెంబర్ ప్లేట్ లేని, కంపెనీలకు చెందిన సైలెన్సర్లను వాడని వాహనాలను సీజ్ చేస్తామన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి, మితిమీరిన వేగంతో వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారుడు వాహనానికి సంబంధించిన పత్రాలను, లైసెన్సును తమతోనే ఉంచుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణలో ప్రజలందరు భాగస్వాములై ట్రాఫిక్ పోలీసువారు ఇచ్చే సూచనలు పాటించి సహకారం అందించాలని కోరారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకు ఎంతో చకచక్యంగా విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ ఎస్సై నరేష్, సిబ్బందిని జిల్లా ఎస్పి రోహిత్ రాజ్ ప్రత్యేక అభినందించారన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కంట్రోల్ బియ్యంపై నిఘా కంట్రోల్ తప్పిందా ?

మొదటి పేజీ తరువాయి

ఒకసారి చిక్కినవారు మళ్ళీ మళ్ళీ పట్టుబడుతున్నా ఏమాత్రం రేషన్ బియ్యం దందాను నిలువరించలేకపోవడం గమనార్హం. ఫలితంగా అక్రమ బియ్యం వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతూనే ఉంది.

### భయంలేని నల్లబజారు వ్యాపారులు.

పోలీసులు, ఇటు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకుంటున్నా నల్లబజారు వ్యాపారులు మాత్రం భయపడటం లేదు. చట్టంలోని లొసుగులను అడ్డం పెట్టుకుని అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఏటా కోట్లాది రూపాయల రేషన్ బియ్యం తరలిస్తున్నా.. అధికారులు మాత్రం మొక్కుబడి తనిఖీలతో సరిపెడుతున్నారు.. దీనికి ప్రధాన కారణం బియ్యం మాఫియాకి వెన్నుదన్నుగా అధికారపార్టీ అండదండలు పుష్కలంగా ఉండటమే కారణమని తెలుస్తోంది. రోజుకు వందలాది బస్తాలు రాష్ట్ర సరిహద్దులు దాటి పోతున్నాయి.

### లాభాలిలా...

పేదలకు పంపిణీ చేసేందుకు కిలో బియ్యానికి ప్రభుత్వం రూ.38.50 వెచ్చిస్తుంది.. లబ్దిదారులకు కిలో రూపాయి చొప్పున అందిస్తుంది. కార్డుదారుల నుండి కొందరు రేషన్ డీలర్లు కిలో 8 రూపాయలు చొప్పున కొనుగోలు చేస్తున్నారు. చీకటి వ్యాపారస్తులకు కిలో 12 రూపాయలు చొప్పున డీలర్లు విక్రయిస్తున్నారు. వీటిని అక్రమ వ్యాపారులు కిలో 15 రూపాయలు చొప్పున అమ్ముతున్నారు. చౌక బియ్యం అక్రమంగా రవాణా చేసేవారు పకడ్బందీగా వ్యవహరిస్తున్నారు. లారీ వెళ్లే సమయంలో తమ అనుచరులను ఏర్పాటు చేసుకుని నిఘా లేదని నిర్ధారించుకున్న తరువాత లారీలు బయలుదేరి నల్లబజారుకు వెళతాయి. ఏది ఏమైనా పూర్తిస్థాయిలో నిరంతరం పోలీసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సంయుక్తంగా నిఘా ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత నెలకొంది. అంతేకాకుండా అక్రమంగా బియ్యం నిల్వ చేసిన రైస్ మిల్లులపై దాడులు చేసి పట్టుబడ్డ నిందితులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తే కొంతవరకైనా రేషన్ మాఫియాకు అడ్డుకట్ట వేయవచ్చని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# అంతరాష్ట్ర దొంగల అరెస్టు

మొదటి పేజీ తరువాయి

సదరు వ్యక్తులు కృష్ణాజిల్లా అవనిగడ్డ మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన బచ్చు సతీష్, ఎన్‌టిఆర్ జిల్లాకు చెందిన రెడ్డిగూడెం మండలంకు చెందిన ఆరింపుల ధర్మరాజులను విచారించగా ఇరువురు కలిసి పలుచోట్ల చోరీకి పాల్పడినట్లు ఒప్పుకున్నారు. వీరిపై సత్తుపల్లి, వేంసూరు, రేపల్లె, నూజివీడు, మైలవరం, అవినిగడ్డ, మరియు దమ్మపేట మండలాల్లో అనేక కేసులు ఉన్నాయి. వీరు చాట్రాయి మండలంలో డబ్బుల కోసం ఒకరిని చంపి పారిపోగా ఈ కేసులో జైలుకు వెళ్ళి బయటకు వచ్చారు. అనంతరం ఆంధ్రాలో కాకుండా తెలంగాణ సరిహద్దు దమ్మపేట మండలంలోని, అశ్వారావుపేట మండలంలో దొంగతనాలకు పాల్పడ్డారు. వీరి వద్ద మూడు తులాల బరువు గల బంగారు నానుతాడు, రెండు మంగళసూత్రాలు, 18 గ్రాముల బంగారంతో పాటు దాడికి ఉపయోగించే వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ శాఖ మంత్రి సొంత జిల్లాలో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం

**చింతకాని సూర్య మేజర్ న్యూస్:** సాక్షాత్తు విద్యుత్ శాఖ మంత్రి సొంత జిల్లా లో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి రైతుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి... ఇంకెంత మంది రైతుల ప్రాణాలు కోల్పోతే విద్యుత్ శాఖ అధికారులు కళ్ళు తెరుస్తారు. విద్యుత్ శాఖ మంత్రి స్పందించి ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకొని విద్యుత్ వ్యవస్థను వ్యవస్థలో పనిచేస్తున్న ఉద్యోగులను సరైన మార్గంలో ఉండేలా చర్య తీసుకుంటారని ఆశిద్దాం. మండలం పరిధిలో నరసింహపురం గ్రామం లో జరిగిన విద్యుత్ ప్రమాద ఘటన మరువకముందే లచ్చగూడెం గ్రామానికి చెందిన గూని ప్రసాద్ అనే రైతు విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ప్రాణాలు వదిలారు. కానీ ఇతని ప్రాణం విలువ కేవలం ఆరు లక్షలకు వెలకట్టి విద్యుత్ అధికారులు చేతులు దులుపుకున్న పరిస్థితి చింతకాని మండలంలో కనిపిస్తోంది విద్యుత్ అధికారులు నిర్లక్ష్యంతో రెండు నెలల్లో ఇద్దరు ప్రాణాలతో చెలగాటమాడి గూని ప్రసాద్ కి ప్రాణానికి వెల కట్టారు. నరసింహపురం గ్రామానికి చెందిన జల్లి రాము అనే యువకుడు ఎలక్ట్రికల్ వర్క్ చేసుకుంటూ లైన్మెన్ కు ఏఈ లకు అందుబాటులో ఉండి వారు చెప్పిన పని చేస్తూ ఉండేవాడు ఇలా అందుబాటులో కుటుంబ పోషణ కోసం అతను సొంతంగా గ్రామంలోని రైతులకు మోటర్ల రిపేర్ కూడా చేస్తూ ఉండేవాడు మోటార్ల రిపేర్ చేసే తరుణంలో ఎల్ సి ఇవ్వమని అడగగా లైన్మెన్ సరే ఇస్తామని చెప్పి ఎల్ సి ఇచ్చి రాము మోటర్ రిపేర్ చేస్తున్న సమయంలో వెంటనే ఎల్ సి ఆన్ చేయడంతో విద్యుత్ షాక్ గురై సావు బతికుల మధ్య బ్రతుకు జీవుడా అంటూ పోరాటం చేస్తున్నాడు. రాము ప్రాణానికి కూడా వెలగట్టి చేతులు దులుపుకున్నారు ప్రస్తుతం రాము ఒక కాలు కోల్పోయి దిక్కుతో మంచంపై ఉన్నాడు తన భార్య ముగ్గురు కూతుళ్ళ పోషణ ఎంత కష్టమో ఒక్కసారి ఆ కుటుంబాన్ని చూస్తే తెలుస్తుంది. ఇలా విద్యుత్ అధికారులు నిర్లక్ష్యంతో రైతు మృతికి కారణమైన అధికారులు ఎవరో కూడా అందరికీ తెలుసు కొదుమూరు చెరువు కట్టపై ఉన్న శివాలయంలో రామలింగేశ్వరుని సాక్షిగా రైతు మృతికి కారణం ఎవరన్నది విద్యుత్ అధికారులు రెవెన్యూ అధికారులు గ్రామస్తుల సమక్షంలో జరిగిన పంచాయితీ లో ప్రతి ఒక్కరికి తెలుసనేది అక్షర సత్యం. రైతు గూని ప్రసాదు మృతి చెందడంతో ఉదయం నుండి సాయంత్రం వరకు ఒకవైపు రైతు కుటుంబ సభ్యులు





గ్రామస్తులు మరోవైపు విద్యుత్ అధికారులు రైతు ప్రాణానికి వెలకట్టారు. ఇంతకీ ఆ ప్రాణం ఖరీదు ఎంత అసలు కుటుంబ సభ్యులు సబ్ స్టేషన్ వద్ద ఆందోళన సృష్టించారు. ఇంత జరిగిన చనిపోయిన రైతుకు ముగ్గురు ఆడపిల్లలు రైతు చనిపోతే కారణమైన వారిని చట్టరీత్యా కఠినంగా శిక్షించాలని విధుల నుండి తొలగించాలని కోదుమూరు సబ్‌స్టేషన్ దగ్గర రైతు మృతదేహంతో ధర్నాకి కూర్చుంటే గందరగోళ వాతావరణం సృష్టించి వందలాదిమంది సమక్షంలో రైతు ప్రాణానికి వెల కట్టిన అధికారులను చూస్తూ ఊరుకుంటారా.. ఊరికే వదిలేస్తారా...ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆ కుటుంబానికి ఎంతో కొంత ఇచ్చి చేతులు దులుపుకున్నారు. విద్యుత్ అధికారులు రాబోయే రోజులలో ఎంత మంది రైతుల ప్రాణాలు తీస్తారు అని మండలంలో రైతాంగం ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి సంఘటనలకు కారణమైన అధికారులను విధులను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. అంతేకానీ వారిపై శాఖా పరమైన చర్యలంటూ ఏమీ ఉండవా అంటే డబ్బుంటే ఏమైనా చేయొచ్చు అనే దానిని నిజం చేశారు విద్యుత్ అధికారులు. చనిపోయిన రైతు తమ పంట చేలో విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి అని ఎన్నిసార్లు విన్నవించుకున్న కనీసం కన్నెత్తి చూడని అధికారులు రైతు కరెంట్ షాక్ తో మరణించగానే లక్షల రూపాయలు ఇస్తామంటూ కాళ్లబేరానికి రావడం ఏమిటి. రైతు చనిపోవడానికి ప్రధాన కారణమైన ఏ ఈబి ఎల్ ఎం లను వెంటనే విధుల నుంచి తొలగిస్తామన్న ఉన్నత స్థాయి అధికారులు వెంటనే వారిని వీధుల్లోని తొలగించాలని ఇటువంటి సంఘటనలు మరొకసారి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటారా లేదా చూద్దాం.

# వాసవి దేవాలయంలో శ్రీ బాల త్రిపుర సుందరీ దేవి అవతారం

## గుర్రాలచెరువులో శ్రీ మహాగౌరి దేవి అలంకరణలో అమ్మవారు



**అశ్వారావుపేట సూర్య, మేజర్‌న్యూస్ :** దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు మండల కేంద్రం అశ్వారావుపేటతో మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం పలు మండపాల్లో అమ్మవార్లు భక్తులకు పలు రూపాల్లో దర్శనమిచ్చారు. పట్టణంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం వద్ద 49వ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 5వ రోజు అమ్మవారు భక్తులకు శ్రీ బాల త్రిపుర సుందరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అదే విధంగా పట్టణ సమీప గుర్రాలచెరువు సమీపంలో వేంచేసి ఉన్న స్వయంభు శ్రీశ్రీశ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారు భక్తులకు శ్రీమహాగౌరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాలను పురస్కరించుకొన ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మహిళలచే సామూహిక కుంకుమ పూజలు, సహస్ర నామార్చనలు జరిపారు. ఈ కార్యక్రమంలో అనేక మంది భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదే విధంగా స్థానిక జంగారెడ్డిగూడెం రోడ్‌లోని కనకదుర్గమ్మ ఆలయం, శిరిడిసాయిబాబ దేవాలయం, డ్రైవర్స్ కాలనీ, రామాలయం, మద్దిరావమ్మగుడి సెంటర్‌ల వద్ద దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవోపేతంగా జరుగుతున్నాయి. అమ్మవార్లు వివిద రూపాలలో దర్శనమివ్వగా భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం పలుచోట్ల బతుకమ్మ వేడుకలను జరిపారు.

# మహాచండీ రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారు

## పూజలు నిర్వహించిన పమిడి కాశీవిశ్వనాధ్ దంపతులు

**దమ్మపేట, సూర్య (మేజర్‌న్యూస్)** – పట్టణంలోని దారా మల్లికార్జునరావు కాంప్లెక్స్‌లో జరుగుతున్న విజయదశమి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారెఅఉ శ్రీ మహాచండీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పట్టణ ఆర్యవైశ్య సంఘం నాయకులు పమిడి





వెంకటేశ్వరరావు తనయుడు పమిడి కాశీవిశ్వనాధ్–రజనీ దంపతులు అమ్మవారికి జరిగిన ప్రత్యేకపూజ కార్యక్రమాల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ క్రమంలోనే పలు రకాల పూలు, పండ్లతో అమ్మవారిని అలంకరించి భక్తులకు అమ్మవారి దర్శనాన్ని కలిగించారు. నిత్యం ప్రత్యేక పూజ కార్యక్రమాలతో పలు సాంస్కృతిక కార్యక్రమాల నడుమ జరుగుతున్న కార్యక్రమాల్లో అధికసంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదములను అందుకుంటున్నారు.

## గర్భిణీ ఉయకా చిన్నక్క మృతికి కారకులైన వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

- ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ముందు ఆందోళన చేపట్టిన గ్రామస్థులు
- మద్దతు తెలిపిన సిపిఎం, కాంగ్రెస్, ఐద్వా
- మృతురాలి భర్తకు, చెల్లెలకు ఉద్యోగం, కూతురికి చదువు బాధ్యత
- హామీనిచ్చిన ఎమ్మెల్యే, ఐటిడిఎ పిఓ



**భద్రాచలం, సూర్య (మేజర్‌న్యూస్) –** దుమ్ముగూడెం పిహెచ్‌సిలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం ఫలితంగా చితగొప్ప గ్రామ వాసిని గర్భిణీ ఉయకా చిన్నక్క మృతికి కారకులైన వారిని విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, మృతురాలి కుటుంబాన్ని ఆదుకోవాలని మండల కేంద్రంలోని పిహెచ్‌సికి మరో వైద్యుని పోస్ట్ భర్తీ చేయాలని గ్రామస్థులు భద్రాచలం ఏరియా ఆసుపత్రి ముందు సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళనకు సిపిఎం, కాంగ్రెస్ పార్టీలతో పాటు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) సంపూర్ణ మద్దతు తెలిపారు. భద్రాచలం ఏరియా ఆసుపత్రి ముందు 4 గంటల పాటు ఆందోళన జరిగిన తర్వాత భద్రాచలం ఎమ్మెల్యే వెంకటరావు వచ్చి వారితో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. అనంతరం ఎమ్మెల్యేతో పాటు గ్రామస్థులు అందరు ఐటిడిఎ పివోను కలిసి తమ ఆవేదనను తెలియచేశారు. దీంతో స్పందించిన పిఓ మృతురాలి భర్తకు, చెల్లెలకు ఉద్యోగ అవకాశం కల్పిస్తామని, 2 సంవత్సరాల కూతురికి చదువు సంబంధించిన అన్ని బాధ్యతలు తీసుకుంటామని తక్షణమే డాక్టరుఎ పోస్టును భర్తీ చేసేందుకు కృషి చేస్తామని హామీనిచ్చారు. తక్షణం దహన సంస్కారాలకు దుమ్ముగూడెం వైద్య సిబ్బంది నుండి రూ.20 వేలు, ఎమ్మెల్యే వెంకటరావు ద్వారా మరో రూ.10 వేల సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కారం పుల్లయ్య, ఎంబి.నర్సారెడ్డి, జిల్లా కమీటి సభ్యులు యలమంచి వంశీకృష్ణ, మర్మం చంద్రయ్య, గడ్డం స్వామి, ఐద్వా నాయకులు డి.సీతాలక్ష్మి, నాదెళ్ళ లీలావతి, సున్నం గంగా, జీవనజ్యోతి, మచ్చా రమా, ఎజె.గౌతమి, వై.పూర్ణ, జి.రాధా, కాంగ్రెస్ మండల అధ్యక్షులు వి.వినీల్‌కుమార్, చింతగుప్ప స్థానిక మాజీ సర్పంచ్ కట్టం కృష్ణ, మృతిరాలి భర్త కృష్ణ, పాయం వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ నీటి సంస్థలు చైర్మన్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



**దమ్మపేట, సూర్య (మేజర్‌న్యూస్) –** తెలంగాణ రాష్ట్ర నీటి సంస్థల చైర్మన్ మువ్వా విజయ్‌బాబును మండల కాంగ్రెస్ నాయకులు హైద్రాబాద్‌లోని ఆయన చాంబర్‌లో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలో ఉన్న పలు చెరువులు, కుంటల సమస్యలను మువ్వ దృష్టికి తీసుకువెళ్ళారు. ఈ క్రమంలోనే తుఫానుల కారణంగా దెబ్బతిన్న చెరువు కట్టలను మెరుగుపరిచేందుకు నిధులను కేటాయించాలని కోరారు. మండలంలోని కొన్ని చెరువులు పరిస్థితి అస్తవ్యస్తంగా ఉందని తుఫానులు సంభవించిన సమయంలో చెరువు ఆయకట్ట దిగువభాగంలో ఉన్న పంటపొలాలు పూర్తిగా మునిగిపోయి రైతులు పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఈ దిశలోనే చెరువు పనులకు నిధులను విడుదల చేయాలని కోరారు. స్పందించిన మువ్వా త్వరలోనే నిధులు ఏర్పాటు చేసి పనులు ప్రారంభించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పర్వతనేని ప్రసాద్, యువజన నాయకులు సాయిల నరసింహారావు, పట్టణ నాయకుడు రొయ్యల కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బతుకమ్మ సంబరాలు



**జూలూరుపాడు, సూర్య (మేజర్‌న్యూస్) –** మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది సోమవారంక బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ప్రజలు ఆరోగ్యంతో పాడిపంటలతో సంతోషంగా ఉండాలని బతుకమ్మకు పూజలు చేశారు. ఆరోగ్య కేంద్ర ప్రాంగణంలో అందంగా తయారు చేసిన బతుకమ్మలను ఉంచి కోలాటంతో ఆడిపాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, సిహెచ్‌ఓ రామకృష్ణ, హెచ్‌ఎన్ వరలక్ష్మి బాయి, హెచ్‌వి ప్రియదర్శిని, రాధిక, ఎఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.



## రూ.12.75 లక్షల విలువగల గంజాయిని పట్టుకున్న పోలీసులు



**అశ్వాపురం, సూర్య (మేజర్‌న్యూస్) –** గొల్లగూడెం ప్రధాన రహదారి పక్కన సోమవారం అశ్వాపురం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానస్పదంగా ఉన్న ఆటోను ఆపి పరిశీలించగా అందులో గంజాయి ఉన్నట్లు గమనించారు. ఈ విషయంపై పోలీసులు ఆటొడ్రైవర్‌ను విచారించగా తన పేరు ఆకుల శివకుమార్ అని భద్రాచలం నుండి వయా మణుగూరు రహదారి గుండా పెద్దపల్లికి తీసుకువెళు తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఆటో గంజాయి 50 కేజీలు ఉంటుందని దాని విలువ రూ.12,75,000/- లు ఉంటుందని, డ్రైవర్‌ని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సిఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

## వైభవంగా కొనసాగుతున్న దసరా ఉత్సవాలు



**అన్నపురెడ్డిపల్లి, సూర్య (మేజర్‌న్యూస్) –** మండలంలోని పలు గ్రామాల్లో దసరా ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. అమ్మవారు రోజుకొక అలంకరణతో భక్తులకు దర్శనమిస్తున్నారు. మండల కేంద్రంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ బాలాజీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలోని అమ్మవారు సోమవారం శ్రీ ధాన్యలక్ష్మి అవతారం, శ్రీ భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి ఆలయంలో శ్రీ అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు భక్తులతో కుంకుమ పూజా కార్యక్రమాలు జరిపించారు. అనంతరం శివాలయం ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మండలపరిధిలోని రాజాపురం పంచాయితీ మేదర్‌బజార్‌లో ఏర్పాటు చేసిన అమ్మవారి సన్నిధిలో మహాఅన్నదానం ఏర్పాటు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఉత్సవ కమిటీ అన్ని ఏర్పాటు చేపట్టారు.

## అక్రమంగా రవాణా చేస్తున్న ఎడ్ల వాహనాన్ని సీజ్ చేసిన పోలీసులు



**టేకులపల్లి, సూర్య (మేజర్‌న్యూస్) –** మండలపరిధిలోని టేకులపల్లిలో సోమవారం అక్రమంగా తరలిస్తున్న ఎడ్ల వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. హైద్రాబాద్‌కి చెందిన మోహిన్ అనే వ్యక్తి కొరకు మహమ్మద్ వాజిద్ అనే వ్యక్తి మొరంపల్లి బంజర నుండి 14 ఎద్దులను టిఎస్ 18 యూఈ 3730 మిని గూడ్స్ వాహనంలో కబేలాకి తరలిస్తుండగా టేకులపల్లి పోలీస్ స్టేషన్ వద్ద వాహనాల తనికీ చేస్తుండగా పట్టుకున్నారు. తరలిస్తున్న ఎడ్లను పాల్వంచ గోశాలకు తరలించి కేసు నమోదు చేసినట్లు టేకులపల్లి ఎస్సై పోగుల సురేష్ తెలిపారు.

## మానవత్వం పరిమిళించిన వేళ

**మల్లికాంబకు నిత్యవసర వస్తువులు అందచేత**

**కొల్లి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కల్పన చౌదరి**





**లక్ష్మీదేవిపల్లి, సూర్య (మేజర్‌న్యూస్) –** పక్షవాతంతో మంచాన పడి అనేక అవస్థలు పడుతున్న వ్యాధిగ్రస్థురాలకు కొల్లి ఫౌండేషన్ వ్యవస్థాక అధ్యక్షులు కల్పన చౌదరి చేయూతనిచ్చి తనలోని మానవత్వాన్ని చాటుకున్నారు. సోమవారం మండలపరిధిలోని మైలారం గ్రామపంచాయితీకి చెందిన రెబ్బా రామచంద్రరావు సతీమణి మల్లికాంబ పక్షవాతంతో మంచాన పడి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటుంది. ఈ విషయం తెలుసుకున్న ఫౌండేషన్ అధ్యక్షులు కల్పన బాధితురాలు మల్లికాంబకు 25 కేజీల బియ్యం, నిత్యవసర వస్తువులు అందించి ఆదుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిస్సహాయ స్థితిలో ఉండి సమాజంలో సహకారం కోసం ఎదురుచూస్తున్న ఎందరో పేద ప్రజలను ఆదుకోవడమే కొల్లి ఫౌండేషన్ లక్ష్యమని, ఎన్నో నిరుపేద గ్రామాలకు చేయూతనిస్తున్నామన్నారు. సమాజంలో ప్రధానంగా విద్య వైద్యం, ఆరోగ్యం తదితర సమస్యలపై దృష్టి సారించామన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ రూప్లానాయక్, సభ్యులు, వాలంటీర్లు జలీల్‌పాషా, బి.రమేష్, మాజీ ఎంపిటీసి సభ్యులు కుంజా రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

# జీవిమాల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం





**మణుగూరు, సూర్య (మేజర్‌న్యూస్) –** పట్టణంలోని అశోక్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన జీవిమాల్ షాపింగ్‌మాల్‌ను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్యఅతిధిగా పాల్గొని రిబ్బన్‌కట్‌చేసి ప్రారంభించారు. అనంతరం జీవిమాల్‌లోని రకరకాల డిజైన్స్ దుస్తులను వీక్షించిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ మణుగూరు పట్టణంలో జీవిమాల్‌నీ ప్రారంభించిన జీవిమాల్ అధినేత గుర్రం ఉమామహేశ్వరరావుకు శుభాకాంక్షలు తెలిపారు. జీవిమాల్‌లో బట్టలు కొనుగోలు చేయాలంటే కొత్తగూడెం, ఖమ్మం, హైద్రాబాద్ ఇలా అనేక ప్రాంతాలకు వెళ్ళవలసి ఉండేదని కానీ ఈ రోజున మణుగూరు పట్టణంలోనే జీవిమాల్ ఓపెన్ చేయడం వల్ల ప్రజలకు ఇతర జిల్లాలకు వెళ్లకుండా క్వాలిటీతో దుస్తులు అందుబాటులో దొరుకుతాయని, జీవిమాల్ సంస్థకు అన్ని విధాలుగా సహాయసహకారాలు అందిస్తామని తెలియచేస్తూ మండల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మణుగూరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు పి.నవీన్, దోసపాటి వెంకటేశ్వరరావు, నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# సలాం పోలీస్



### ఆదివాసీ విద్యార్థుల ఇక్కట్లు తీర్చిన చర్ల పోలీసులు

### పోలీసుల ఆధ్వర్యంలో పాఠశాలకు నూతన భవనం

### మావోయిస్టులకు దూరంగా ఉంటామంటున్న గ్రామస్థులు





**చర్ల, సూర్య (మేజర్‌న్యూస్) –** మావోయిస్టుల ఇలాకాలో ప్రజలకు ఉపయోగపడే మంచిపనులు చేసి పోలీసులు ప్రజల మన్ననలు పొందుతున్నారు. మారుమూలన ఉన్న ఆదివాసీ గ్రామాలకు విద్య, వైద్యం వంటి సదుపాయాలు కల్పించడంలో తమ వంతు కృషి చేస్తూ శభాష్ పోలీస్ అనిపించుకుంటున్నారు. చర్ల మండలంలోని మారుమూల గ్రామం బూరుగుపాడులో ఒక చిన్నపాకలో నిర్వహిస్తున్న పాఠశాలలో సౌకర్యాల లేమి వల్ల ఆదివాసీ చిన్నారులు పడుతున్న ఇబ్బందులు చూసి చలించిపోయిన చర్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజువర్మ గ్రామస్థులతో మాట్లాడి పోలీస్‌శాఖ తరపున సుమారు రూ.3లక్షలతో పాఠశాలకు నూతన భవనం నిర్మింపచేశారు. నూతన పాఠశాల భవనాన్ని సోమవారం జిల్లా ఎస్పి రోహిత్‌రాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీల అభివృద్ధే ధ్యేయంగా పోలీస్‌శాఖ పనిచేస్తుందన్నారు. వెనకబాటు తనం పోగొట్టలంటే చదువు ఒక్కటే ఆయుధమన్నారు. మావోయిస్టులు అభివృద్ధి నిరోధక చర్యలు చేయడమే తప్ప ప్రజలకు ఉపయోగపడే ఏ ఒక్క పనిచేయలేదని గ్రామస్థులకు గుర్తు చేశారు. ఆదివాసీ ప్రజలను బలవంతంగా సమావేశాలకు పిలవడమే తప్ప బడులను బాగుచేసే పనులు చేపట్టలేదన్నారు. ప్రజలకు ఉపయోగపడే పని మావోయిస్టులు చేపడతారా.... అంటూ సవాల్ విసిరారు. గ్రామంలో ఎలాంటి సమస్యలున్న పోలీసుల దృష్టికి తీసుకురావాలని, మావోయిస్టుల స్వార్థ ప్రయోజనాల కోసం ప్రజలు బలి కావద్దని హితవు పలికారు. తల్లితండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని, ఆరోగ్యం పట్ల కూడా శ్రద్ధ వహించాలన్నారు. అనారోగ్యం వస్తే మూఢనమ్మకాలతో నాటు వైద్యాన్ని ఆశ్రయించవద్దని ఆసుపత్రికి తీసుకురావాలని, నూతన పాఠశాల భవనాన్ని చూసి ఆ పాఠశాలలో చదువుతున్న చిన్నారుల ఆనందం అంతా ఇంతా కాదు. ఆదివాసీ సాంప్రదాయ నృత్యాలు చేస్తూ తమ సంతోషాన్ని వెల్లిబుచ్చారు. పోలీసులు చేపడుతున్న కార్యక్రమాలతో సంతోషించిన బూరుగుపాడు ఆదివాసీలు ఇకపై తాము మావోయిస్టు కార్యకలాపాలకు వెళ్లబోమని తెలియచేయడం కొసమెరుపు, ఈ కార్యక్రమంలో ఓఎస్‌డి సాయిమనోహర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్సై నర్సిరెడ్డి, సిఆర్‌పిఎఫ్ 141 బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, పాఠశాల ప్రాధానోపాధ్యాయుడు వీరాస్వామి, గ్రామస్థులు పాల్గొన్నారు.

### లొంగిపోయిన మావోయిస్టులకు ప్రోత్సాహం....

నిషేధిత మావోయిస్టు పార్టీలో పనిచేస్తూ పార్టీ సిద్ధాంతాలు నచ్చక ఇటీవల కాలంలో లొంగిపోయిన ఐదుగురు మావోయిస్టు సభ్యులకు సోమవారం చర్ల పోలీస్‌స్టేషన్‌లో జిల్లా ఎస్పి రివార్డులను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అజ్ఞాతవం నుండి బయటకు వచ్చి కుటుంబసభ్యులతో ప్రశాంత జీవనం గడపాలనుకునే మావోయిస్టులకు ప్రభుత్వం తరపున అన్ని రకాల ప్రతిఫలాలను గౌరవ సహాయాన్ని అందించే విధంగా పోలీస్‌శాఖ తరపున బాధ్యత తీసుకుంటామన్నారు. లొంగిపోవాలనుకునే వారు తమ గ్రామపెద్దలు లేదా పోలీస్ అధికారులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్పి మడివి సోమమ్మ, మడకం లింగ, మడవి భద్రయ్య, కట్టం పొజ్జమయ్య, కల్ము బుద్రలకు చెక్కులను అందచేశారు. పోలీస్‌శాఖ తరపున చేపడుతున్న కార్యక్రమాలకు ఆకర్షితులై ఇంకొంతమంది మావోయిస్టులు లొంగుపోయే అవకాశం ఉందన్నారు.

# మాజీ సర్పంచ్‌ను కుటుంబసభ్యులను పరామర్శించిన పలువురు నేతలు





**చంద్రుగొండ, సూర్య (మేజర్‌న్యూస్) –** చంద్రుగొండ మాజీ సర్పంచ్ బేతి సోమయ్య కుటుంబసభ్యులను పలు పార్టీల నాయకులు సోమవారం అయ్యన్నపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన దశదిన కార్యక్రమంలో పాల్గొని పరామర్శించారు. ఇటీవల మాజీ సర్పంచ్ బేతి సోమయ్య భార్య రామలక్ష్మి గుండెపోటుతో మృతి చెందారు. ఈ సందర్భంగా నాయకులు రామలక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బేతి సోమయ్య కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో గుంపెన సొసైటి చైర్మన్ ఎన్.వెంకటనారాయణ, జిల్లా నాయకులు మేడా మోహన్‌రావు, గ్రామ పార్టీ అధ్యక్షులు ఎస్.వెంకటేశర్లు, నాయకులు వి.బాబురావు, బి.రాజ్‌కుమార్, బిజెపి జిల్లా నాయకులు ఎన్.రఘుపతిరావు, కాంగ్రెస్ మండల నాయకులు వి.శ్రీనివాసరావు, మాజీ వార్డు సభ్యులు పి.రాములు, తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిలోని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు

### ఫేక్‌న్యూస్‌ని నమ్మి నిరుద్యోగులు మోసపోవద్దు

### సిపిఎం పార్టీ మండల కార్యదర్శి అబ్దుల్‌నభి



**ఇల్లందు టౌన్, సూర్య (మేజర్‌న్యూస్) –** సింగరేణిలో అవుట్‌సోర్సింగ్ పేరుతో భారీగా 850 ఉద్యోగాలు వివిధ క్యాటగిరిలలో ఉన్నట్లు వాట్సాప్‌లో ఫేక్ న్యూస్ చెక్కర్లు కొడుతున్నాయని వీటిని నమ్మి నిరుద్యోగులు మోసపోవద్దని ఇల్లందు సిపిఎం పార్టీ మండల కార్యదర్శి అబ్దుల్ నభి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయంలో అందుబాటులో ఉన్న సింగరేని అధికారులను అడుగగా ఫేక్ న్యూస్ అని తెలిందన్నారు. నిరుద్యోగులు మోసపోవద్దని, ఈ విషయంపై సింగరేణి యాజమాన్యం తక్షణమే ప్రకటన జారీ చేయాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

# ప్రజావాణిలోని దరఖాస్తును పరిశీలించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

### అదనపు కలెక్టర్ వేణుగోపాల్



**కొత్తగూడెం కలెక్టరేట్, సూర్య (మేజర్‌న్యూస్) –** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయ సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. ఈ సందర్భంగా దరఖాస్తు చేసిన అభ్యర్థులను వివ రాలను అడిగి తెలుసుకొనిక సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని శాఖల వారీ గాఅధికారులనుఆదేశించారు.ఈ కార్యక్రమంలో అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

# మంచు శివలింగానికి ప్రత్యేక పూజలు



**అన్నపురెడ్డిపల్లి, సూర్య (మేజర్‌న్యూస్) –** మండల కేంద్రంలోని శ్రీ విఘ్నేశ్వర వాసవి కళ్యాణ మండపంలో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో దేవి నవరాత్రులు అంగరంగ వైభవంగా జరుగుతున్నాదయి. అమ్మవారిని రోజుకొక అవతారంలో అలంకరణ చేస్తూ భక్తులకు దర్శనమిస్తున్నారు. మండలంలో సోమవారాన్ని పురస్కరించుకొని వెయ్యి దీపోత్సవాన్ని నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళ చేపూరి పద్మప్రియ కుటుంబసభ్యులు మంతో కూడిన నలుగు రంగుల శివలింగాలరు తయారు చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మంచుతో కూడిన శివలింగాన్ని దర్శించుకోవాలంటే అమర్నాథ్ యాత్రలో సాధ్యమని అలాంటి మంచుతో కూడిన శివలింగాన్ని ఏర్పాటు చేసినందుకు ఆర్యవైశ్య మహిళ ప్రియాంకను ఆర్యవైశ్య సభ్యులు అభినందించారు.

# కనకదుర్గమ్మ నవరాత్రుల సందర్భంగా అన్నదానం

### కౌన్సిలర్ మాచర్ల రాజకుమారి





**దమ్మపేట, సూర్య (మేజర్‌న్యూస్) –** మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డు న్యూ గొల్లగూడెంలో వినాయకయూత్ ఆధ్వర్యంలో శ్రీ కనకదుర్గమ్మ దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా 5వ రోజు కౌన్సిలర్ మాచర్ల రాజకుమారి ఆధ్వర్యంలో సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నవరాత్రులు కనకదుర్గమ్మదేవిని ఎంతో నియమ నిష్టలతో అమ్మవారిని పూజా కార్యక్రమాలు నిర్వహించి 9 రోజులు ఒక్కొక్క అలంకరణతో పూజా కార్యక్రమాలు నిర్వహించి అన్నదానం నిర్వహించడం ఎంతో సంతోషాన్ని ఇస్తుందన్నారు. వార్డు ప్రజలు అమ్మవారి దయవల్ల సుఖ సంతోషాలతో, అష్టైశ్వర్యాలతో చల్లగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డ్ కౌన్సిలర్ మాచర్ల శ్రీనివాస్‌కుమార్, రాము, చరణ్, పవన్, నాగరాజు, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

# వాహనాలు తనిఖీ చేసి బైకులను సీజ్ చేసి ఫైన్ విధించిన సబ్ ఇన్స్పెక్టర్.పి.సంతోష్





**నేలకొండపల్లి సూర్య మేజర్ న్యూస్ :** వాహనాల తనిఖీల్లో భాగంగా మండలంలో పలు వాహనాలను తనిఖీ చేసి నెంబర్ ప్లేట్ లేని 8 వాహనాలను సీజ్ చేసిన సబ్ ఇన్స్పెక్టర్.పి.సంతోష్. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ... వాహనదారులకు కౌన్సిలింగ్ చేశారు.చలానా స్వీకరించిన ప్రతి వ్యక్తి నెంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న బైకు యజమానులకు తెలియజేయాలని సూచించారు.నెంబర్ ప్లేట్ లేకుండా ఎవరైనా వాహనాన్ని నడిపితే వారిపై కేసు నమోదు చేస్తామని వెల్లడించారు.వాహనం కలిగిన ప్రతి వ్యక్తి బాధ్యతగా నడవాలని సూచించారు.వాహనా దారులు నెంబర్ ప్లేట్ తో నడవాలని సూచించారు.నెంబర్ ప్లేట్లు లేని వాహనదారులకు కౌన్సిలింగ్ చేసి చలానా విధించి ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా నడవాలని సూచించారు. వాహనాల తనిఖీల్లో సిబ్బంది పాల్గొన్నారు.

# తాగునీటి కోసం రోడ్లెక్కిన గ్రామస్తులు

### జాతీయ రహదారి పై రాస్తారాకో



**నేలకొండపల్లి సూర్య మేజర్ న్యూస్ :** తాగునీటి సమస్య ను పరిష్కరించాలని కోరుతూ...గ్రామస్తులు %×% రోడ్కెక్కారు. మండలం లోని పైనంపల్లి గ్రామం లో గత రెండు నెలల నుంచి తాగునీరు అందక ఎస్సీ కాలనీ ప్రజలు అల్లాడుతున్నారు. పలుమార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవటం లేదని అగ్రహం వ్యక్తం చేశారు.దీంతో సోమవారం కోదాడ-ఖమ్మం జాతీయ రహదారి పై ఖాళీ బిందెలతో రాస్తారాకో నిర్వహించారు.రెండు వైపులా భారీగా వాహానాలు నిలిచిపోయాయి.ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ...స్థానిక అధికారులను తాగునీటి ఇబ్బందులు తీర్చండి అని అడిగితే డబ్బులు లేవని చెప్పి చేతులు దులుపుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే తాగునీటి సమస్య ను పరిష్కరించకుంటే ప్రత్యక్ష ఆందోళణ చేస్తామని హెచ్చరించారు. ఘటనా స్థలం కు పోలీసులు చేరుకుని సంబంధిత అదికారులతో చర్చలు జరిపారు.ఈ కార్యక్రమంలో కోటయ్య, ఇస్సాకు,గొర్రె బాలరాజు,కే రాణి,కే,కళ,దేవ కర్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఎంబిబిఎస్ సీటు సాధించిన ధారావత్ వెన్నెల



**ఏన్కూర్ సూర్య మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని కోనయపాలెం గ్రామానికి చెందిన ధరావత్ వెన్నెల ఎంబిబిఎస్ లో ఫ్రీ సీట్ సాధించింది. తన తండ్రి ప్రభుత్వ ఉపాధ్యాయుడు ధారావత్ నరసింహారావు తన చిన్నతనంలోనే చనిపోవడంతో తల్లి జ్యోతి కుమార్తెను తల్లి ప్రోత్సాహంతో ఎంతో కష్టపడి చదివి మహబూబాద్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ సీటు సాధించింది.చిన్ననాటి నుండి చదువులో ఎంతో చురుగ్గా రాణించేది,ఆ కష్టానికి ఫలితంగా ఈరోజు ఎంబీబీఎస్ సీటును వెన్నెల సాధించింది.ఆమెకు ఎంబీబీఎస్ సీటు రావడం పట్ల కుటుంబ సభ్యులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. అదేవిధంగా గ్రామానికి చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు ఆమెకు అభినందనలు తెలియజేశారు.

# సన్న రకం ధాన్యం కొనుగోలుకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు.. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్







### 24 గంటల వ్యవధిలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించాలి

### కొనుగోలు కేంద్రాలలో అవసరమైన మౌళిక వసతుల కల్పన

### సన్నరకం ధాన్యాన్ని వ్యవసాయ అధికారులు పక్కాగా ధృవీకరించాలి

### ధాన్యం రవాణాకు అవసరమైన వాహనాలను సన్నద్ధం చేయాలి

### సన్న రకాల ధాన్యాన్ని ప్రత్యేకంగా కేటాయించిన రైస్ మిల్లులకు తరలింపు

### ధాన్యం కొనుగోలుపై సంబంధిత అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం, సూర్య బ్యూరో అక్టోబర్ 06 :** ఖరీఫ్ 2024-25 సీజన్ లో జిల్లాలో సన్న రకం ధాన్యం కొనుగోలుకు ప్రత్యేకంగా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సోమవారం భక్త రామదాసు కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు సన్నాహక సమావేశంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, శిక్షణ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్ 2024-25 లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చివరి గింజ వరకు నాణ్యమైన వడ్లను మద్దతు ధరపై కొనుగోలు చేసి 48 గంటల్లో చెల్లింపులు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం జిల్లాలో అంచనా ప్రకారం 3 లక్షల మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యం, లక్ష మెట్రిక్ టన్నుల దొడ్డు రకం ధాన్యం కొనుగోలు చేయబోతున్నామని అన్నారు. సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం 500 రూపాయల బోనస్ ప్రకటించిన నేపథ్యంలో కొనుగోలు కేంద్రాలకు అధికంగా వచ్చే అవకాశం ఉందనే అంచనాతో అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులు గ్రామాల వారీగా సన్న రకం ధాన్యం ధృవీకరణ చేసి కొనుగోలు కేంద్రాల మ్యాపింగ్ చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రం పరిధిలో సన్న రకం, దొడ్డు రకం ధాన్యం దిగుబడి అంచనాలను బుధవారం నాటికి అందజేయాలని కలెక్టర్ తెలిపారు. సన్న రకం ధాన్యానికి, దొడ్డు రకం ధాన్యానికి వేర్వేరు కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతి మూడు, నాలుగు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ఒక మండల స్థాయి అధికారిని పర్యవేక్షణ అధికారిగా నియమించామని అన్నారు. మండల స్థాయి అధికారులు వారి పరిధిలో ఉన్న కొనుగోలు కేంద్రాలను పరిశీలించి స్థలం అనుకూలత, మౌళిక వసతులు (వెయింగ్ యంత్రాలు, తేమ యంత్రాలు, ప్యాడీ క్లీనర్, టార్ఫాలిన్), గన్ని సంచులు నాణ్యత పరిశీలన చేయాలని అన్నారు. ప్రతి రోజు మండల అధికారులు వారి పరిధిలోని కొనుగోలు ప్రక్రియ తనిఖీ చేయాలని కలెక్టర్ సూచించారు. ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత గన్ని సంచులకు ట్యాగ్ ఏర్పాటుచేసి, దానిపై సెంటర్ నెంబర్ వేయాలని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలు 24 గంటలలో తరలించాలని, లేని పక్షంలో రవాణా కాంట్రాక్టర్లకు కోత విధించడం జరుగుతుందని, ఈ అంశాన్ని స్పష్టంగా అమలు చేయాలని కలెక్టర్ రవాణా శాఖ అధికారిని ఆదేశించారు. రైస్ మిల్లులో ఎట్టి పరిస్థితుల్లోను తాళ్ళు కట్ చేయడానికి వీలు లేదని, నాణ్యతను కొనుగోలు కేంద్రాల దగ్గరే పరిశీలించి పంపాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద, రైస్ మిల్లుల వద్ద ఎక్కడ హమాలీల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. మండలంలో జరుగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియపై మండల ప్రత్యేక అధికారికి సంపూర్ణ అవగాహన ఉండాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వేయింగ్ యంత్రాలను పరీక్షించాలని కలెక్టర్ తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వచ్చే షెడ్యూల్ ప్రకారం కొనుగోలు కేంద్రాలలో అవసరమైన మౌళిక వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సరిహద్దుల నుంచి మన జిల్లాకు ఎట్టి పరిస్థితుల్లో ధాన్యం రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో త్రాగు నీరు, విద్యుత్ సరఫరా, లైట్లు, నీడ మొదలగు సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని ఎప్పటి కప్పుడు రైస్ మిల్లులకు తరలించేందుకు వీలుగా అవసరమైన మేర వాహనాలు సన్నద్ధం చేయాలని కలెక్టర్ తెలిపారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. కొనుగోలు కేంద్రాలపై వచ్చే వ్యతిరేక వార్తలను ఎప్పటికప్పుడు పరిశీలించి, లోపాలు ఏవైనా ఉంటే సవరించుకొని సమాధానం అందజేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో పాల్గొన్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇంచార్జికి అవసరమైన మేర శిక్షణ అందిస్తామని అన్నారు. ఐకెపి కేంద్రాలు తేమ యంత్రాల పనితీరు పరిశీలించి అవసరమైతే నూతన యంత్రాల కోసం డి.ఆర్.డి.ఓ. కు ప్రతిపాదనలు అందించాలని అన్నారు. పి.ఏ.సి.ఎస్ సంబంధించి కొనుగోలు కేంద్రాలకు తప్పనిసరిగా 2 నుంచి 3 ఎకరాల స్థలం అందుబాటులో ఉండాలని అన్నారు. సన్న, దొడ్డు రకం కొనుగోలు నిమిత్తం వేరు వేరు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. నూతన కొనుగోలు కేంద్రాలకు సంబంధించి ఇంచార్జి అదనపు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీవో సన్యాసయ్య, ఆదనపు డిసిపి ప్రసాద రావు, జిల్లా సహకార అధికారి గంగాధర్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్, జిల్లా మార్కెటింగ్ అధికారి అలీమ్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ శ్రీలత, మండల ప్రత్యేక అధికారులు, తహసిల్దార్లు, ఎంపిడిఓ లు, ఎంపీవోలు లు, డిపిఎం లు, కొనుగోలు కేంద్రాల బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన పేదలందరికీ ఇల్లు మంజూరు చేయాలి: సిపిఎం



**బోనకల్, సూర్య (మేజర్ న్యూస్):** మండల పరిధిలోని 22 గ్రామాలలో అర్హులైన పేదలందరికీ పక్క గృహాలు మంజూరు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతలచెరువు కోటేశ్వరరావు మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు లు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహిస్తున్న ప్రజావాణిలో సోమవారం ఎంపీడీవో వ్యాకరణం వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రికి వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ మంజూరు చేసిన ఇళ్లతో పాటు, రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం గ్రామానికి 10 నుంచి 15 ఇళ్లను మంజూరు చేసిందని, కానీ ఆ ఇళ్లను కూడా అర్హులైన వారికి కాకుండా కేవలం ఆ పార్టీ కార్యకర్తలకే మంజూరు చేసిందన్నారు. దీనివలన అనేకమంది పేదలు ఇల్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గ్రామసభల ద్వారానే లబ్ధిదారులను ఎంపిక చేయటం వలన పేదలకు లబ్ధి చేకూరుతుందన్నారు. గత పది ఏళు గా ప్రభుత్వం పక్కా గృహాలు మంజూరు చేయకపోవడం వలన ఈ 10 ఏళ్లలో అనేక కుటుంబాలు పెరిగాయని, ఒకే ఇంటిలో రెండు, మూడు కుటుంబాలు ఉంటున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వము లాగా కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన వారికే ఇల్లు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు బంధం శ్రీనివాసరావు, పెద్దపోలు కోటేశ్వరరావు, సిపిఎం పెద్ద బీరువాలు గ్రామ శాఖ కార్యదర్శులు చింతలచెరువు రమేష్, పెద్దపోలు రామారావు, ఇల్లు లేని పేదలు కోనంగి శ్రీను షేక్ అల్లా భాష, గంగదేవుల మల్లేశ్వరి, చట్టి నాగేశ్వరరావు, కుక్కల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ శాఖల వసతి గృహాలకు సంబంధించి నివేదికలు సమర్పించాలి

**సమీకృత రెసిడెన్షియల్ పాఠశాలల సముదాయ శంఖుస్థాపన కు ఏర్పాట్లు చేయాలి**

**ఉపముఖ్యమంత్రి సమీక్ష, సమీకృత రెసిడెన్షియల్ పాఠశాలల శంఖుస్థాపన లపై అధికారులతో సమీక్ష చేసిన జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**



**ఖమ్మం, సూర్య బ్యూరో :** మంగళవారం ఉపముఖ్యమంత్రి సమీక్ష కు, ఈనెల 11న సమీకృత రెసిడెన్షియల్ పాఠశాలల సముదాయాల శంఖుస్థాపన కార్యక్రమాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ తో కలిసి, ఎస్సి, ఎస్టీ, బిసి, మైనారిటీ సంక్షేమ అధికారులతో ఉపముఖ్యమంత్రి సమీక్షపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మంగళవారం ఉపముఖ్యమంత్రి సంక్షేమ వసతి గృహాల నిర్వహణపై సమీక్ష నిర్వహించనున్నారని, నివేదికలు సిద్ధంచేసి సమర్పించాలని అన్నారు. అన్ని సంక్షేమ శాఖలకు సంబంధించి ఒకే ఫార్మాట్ లో నివేదిక ఉండాలని ఆయన తెలిపారు. జిల్లాలో ఎన్ని వసతి గృహాలు ఉన్నవి, ఏ ఏ ప్రదేశాల్లో ఉన్నవి, స్వంత భవనమా, అద్దె భవనామా, సమస్యలు సంగ్రహంగా పొందుపర్చుతూ నివేదికలు సిద్ధం చేయాలన్నారు. ఈ నెల 9న డిఎస్సి ఉద్యోగ నియామకపత్రాలను హైదరాబాద్ లో సీఎం చేతుల మీదుగా అందుకోవడానికి జిల్లా నుండి ఎంపికయిన వారిని హైదరాబాద్ తీసుకొని వెళ్లుటకు బస్సుల ఏర్పాటుకు కార్యాచరణ చేయాలన్నారు. 500 మందికి పైగా ఎంపికయిన వారు జిల్లా నుండి ఉన్నందున తదనుగునంగా బస్సుల ఏర్పాటు ఉండాలన్నారు. ఈ నెల 11న జిల్లాలో సమీకృత రెసిడెన్షియల్ పాఠశాలల సముదాయ శంఖుస్థాపనకు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలన్నారు. పాఠశాల చుట్టుప్రక్కల గ్రామాల నుండి విద్యార్థుల సమీకరణ చేయాలని, విద్యార్థులు యూనిఫామ్ లో హాజరయ్యేలా చూడాలని అన్నారు. పాఠశాల చుట్టుప్రక్కల గ్రామాల్లో పాఠశాలకు సంబంధించి వివరాలతో చక్కటి ఫ్లెక్సీ తయారుచేసి ప్రదర్శించాలన్నారు. సమీకృత రెసిడెన్షియల్ పాఠశాల కు సంబంధించి సదుపాయాలు, ఉపాధ్యాయులు, మెరుగైన విద్య, సౌకర్యాల గురించి విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు. గ్రామాల్లో గ్రామసభలు ఏర్పాటుచేసి, చర్చ జరగాలన్నారు. దళితబంధు గ్రౌండింగ్ యూనిట్లలో దారిమళ్ళిన యూనిట్ల విషయమై తీసుకున్న చర్యలపై నివేదిక సమర్పించాలన్నారు. దారిమళ్లిన యూనిట్ వివరాలు, లబ్దిదారుడు, యూనిట్ ఇప్పుడున్న వారి వివరాలు, తీసుకున్న చర్యలపై నివేదిక సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో శిక్షణ సహాయ కలెక్టర్ శ్రేష్ఠ, జిల్లా ఎస్సి సంక్షేమ అధికారి/ఇంచార్జ్ మైనారిటీ సంక్షేమ అధికారి సత్యనారాయణ, జిల్లా గిరిజన సంక్షేమ అధికారిణి విజయలక్ష్మి, జిల్లా విద్యాధికారి సోమశేఖరశర్మ, ముఖ్య ప్రణాళిక అధికారి ఏ. శ్రీనివాస్, ఇంచార్జ్ ఎస్సి కార్పొరేషన్ ఇడి నవీన్ బాబు, అధికారులు పాల్గొన్నారు.

# ఏన్కూరు ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన రఫీ




**ఏన్కూర్ సూర్య మేజర్ న్యూస్:** ఖమ్మం కమిషనర్ ఆఫ్ పోలీస్ ఆదేశాల మేరకు ఏన్కూరు మండల నూతన ఎస్సైగా సోమవారం రఫీ బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీలో భాగంగా ఇక్కడ ఎస్సైగా ఉన్న బాదావత్ రవి ఖమ్మం వెళ్లగా ఖమ్మం టూ టౌన్ లో పనిచేసినటువంటి రఫీ ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా వచ్చిన ఎస్ఐ రఫీకి పోలీస్ స్టేషన్ సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా చూస్తామన్నారు.

# వి.ఆర్.ఏ లను జె.ఆర్.ఓ లుగా నియమించండి



**కల్లూరు సూర్య మేజర్ న్యూస్ అక్టోబర్ 07 :**–గ్రామ రెవెన్యూ వ్యవస్థ పై పూర్తి అవగాహన ఉన్న వి.ఆర్.ఏ లను జేఆర్వోలుగా తీసుకుంటే గ్రామాల్లోనే అనేక రెవెన్యూ సమస్యలకు పరిష్కారం సులభతరం అవుతుందని మండల ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో గ్రామాల్లో నెలకొన్న అనేక సమస్యలు సివిల్ సమస్యలే.ఈ సమస్యలే పెరిగి పెద్దవిగా మారి అనేక మంది ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు అనేకం చూస్తున్నము.గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో సివిల్ సమస్యలకు ముగింపు పలకాల్సింది పోయి సమస్య జటిలంగా మారిందని ఈ సమస్యలకు శాశ్వత పరిష్కార మార్గం కావాలంటే గ్రామ రెవెన్యూ వ్యవస్థ పై పూర్తి స్థాయిలో అవగాహన ఉన్న వీఆర్ఏలను జేఆర్వోలుగా తీసుకుంటే చాలా వరకు సమస్యలకు పరిష్కార మార్గం దొరుకుతుందని ప్రజలు తమ అభిప్రాయాన్ని వ్యక్తపరుస్తున్నారు.అదే గ్రామాల్లో వీఆర్ఏ లు ఉన్నట్లయితే విద్యార్థిని విద్యార్థులకు కానీ రైతన్నలకు కానీ ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండేదని గ్రామ ప్రజలు వాపోతున్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విరిపై దృష్టి సారించి తిరిగి అదే వీఆర్ఏ వ్యవస్థను తీసుకువచ్చి ప్రజలకు న్యాయం జరిగే విధంగా చూస్తానని హామీ ఇచ్చినట్లు సమాచారం ఒకవేళ వీఆర్ఏ వ్యవస్థను తీసుకొచ్చినట్లయితే వీఆర్ఏలను జేఆర్వోలుగా నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.అదే గ్రామాల్లో వీఆర్ఏ వ్యవ్యస్త ఉన్నట్లయితే విద్యార్థిని విద్యార్థులకు వారి వారి ధ్రువపత్రాలు కోసం ఇబ్బంది పడాల్సిన అవసరం లేకుండా ఉండేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. అలానే కాకుండా రైతులు విషయానికి వస్తే పాస్బుక్కులు కానీ ఇంకా ఇతర ఏమైనా రెవెన్యూ సమస్యలకు వీఆర్ఏలు ఉన్నట్లయితే వారికి కూడా పూర్తిస్థాయిలో సహకారం ఉండేదని రైతులు వాపోతున్నారు ఏది ఏమైనా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యార్థులకు రైతన్నలకు న్యాయం జరిగే విధంగా ఆలోచించాలని ప్రజలు కోరుతున్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్







**ఖమ్మం, అక్టోబర్ - 07:** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు ప్రాధాన్యత ఇచ్చి, త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, శిక్షణ సహాయ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ లతో కలిసి ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. చింతకాని మండలం అనంతసాగర్ గ్రామానికి చెందిన శీలం లక్ష్మి తన భర్త అనారోగ్య కారణంతో మరణించారని, దళిత బంధు యూనిట్ క్రింద 2022 సెప్టెంబర్ లో గొర్రెల షెడ్డు వేశామని, గొర్రెలు ఇప్పటి వరకు రాలేదని, తనకు గొర్రెలు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ,ఎస్సి కార్పొరేషన్ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. రఘునాథపాలెం మండలం వి.వి. పాలేం గ్రామానికి చెందిన కొల్లి ఉపేంద్రయ్య తనకు 2020-21 లో మంజూరు చేసిన ఎస్సి స్వశక్తి యూనిట్ సబ్సిడీ డబ్బులు ఇప్పటి వరకు రాలేదని, ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఈడి ఎస్సి కార్పొరేషన్ కు రాస్తూ అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న మల్టీ పర్పస్ వర్కర్లు తమకు 5 నెలలుగా జీతాలు పెండింగ్ లో ఉన్నాయని, ప్రస్తుతం కొన్ని పంచాయతీలలో రెండు, మరికొన్నిటీలో ఒక నెల జీతం చెల్లిస్తామని చెప్పారని, మా యందు దయతలచి దసరా లోగా అన్ని నెలల జీతాలు చెల్లించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా పంచాయతీ అధికారికి రాస్తూ గ్రామంలోని జనరల్ ఫండ్ వివరాలు పరిశీలించి మల్టీ పర్పస్ వర్కర్ల జీతాలు పూర్తి స్థాయిలో చెల్లింపుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. వైరా పట్టణం 10వ వార్డు గండగలపాడు కు చెందిన ఎం. సైదులు, తన భార్య రాజ్యలక్ష్మి పుట్టుకతో దివ్యాంగురాలని, గత 13 ఏండ్లుగా నడుం పడిపోయి మంచెంలో ఉంటుందని, తన భార్యకు సదరం సర్టిఫికెట్ అందించాలని దరఖాస్తు చేసుకోగా, డిపిఎం కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఖమ్మం రూరల్ మండలం పెద్దతండకు చెందిన డి. ఉపేందర్, సాగర్ పంట కాలువ అప్రోచ్ కెనాల్ ద్వారా రైతుల పొలాలకు నీరు అందించే కాలువను ఇష్టం వచ్చినట్లుగా కబ్జా చేశారని, ఈ కాలువకు పునర్జీవం కల్పించి నీరు పడే విధంగా చేయగలరని పెద్దతండా గ్రామ ప్రజలు కోరగా, ఈఈ ఇరిగేషన్ శాఖకు రాస్తూ పరిశీలించి నివేదిక రూపొందించి సమర్పించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం జిల్లా కోశాధికారిగా జిల్లాలో సేవలు అందించిన వి. సత్యనారాయణ, మహబూబాబాద్ జిల్లాకు బదిలీ అయిన సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జెడ్పీ సి.ఈ.ఓ. దీక్ష రైనా, డి.ఆర్.డి.ఓ. సన్యాసయ్య , కలెక్టరేట్ ఏ.ఓ. అరుణ, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై అర్జీలు వెల్లువా



**తిరుమలాయపాలెం, సూర్య మేజర్ న్యూస్ :** నిరుపేదలకు వెంటనే ఇండ్ల స్థలాలను పంచాలి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ%శీ% ను ప్రారంభించాలి తిరుమలాయపాలెం మండల కేంద్రంలో లోని ఎంపీడీవో ఆఫీసులో ప్రజా సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించే ప్రజావాణి కార్యక్రమానికి అనూహ్యస్పందన మండల కేంద్రం, కొక్కిరేణి, పైనంపల్లి గ్రామ ప్రజలకు ప్రభుత్వం వారు 75 గజాల చొప్పున ఇళ్ల పట్టాలు ఇచ్చి స్థలం చూపించలేదు , ఈ విషయమై గౌరవ రెవిన్యూ మంత్రివర్యులు శ్రీ పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి ని అఖిల పక్ష నాయకులు కలిసి చెప్పినప్పుడు వెంటనే స్పందించి అట్టి స్థలాలను పంచుదామని హామీ ఇచ్చినారు. కానీ నేటి వరకు పంపకాలు జరగలేదు , ఒకే కుటుంబంలో ముగ్గురు నలుగురు అన్నదమ్ములు ఉండి చాలా ఇబ్బందులు పడుతున్నారు అని , తిరుమలాయపాలెం మండలంలో ఇళ్ల స్థలాలు అనేది పెద్ద సమస్య గా అయిపోయింది కావున అధికారుల తక్షణమే స్పందించి అర్హులైన లబ్ధిదారులకు . ఇళ్ల స్థలాలను లబ్ధి దారులకు కేటాయించి, ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు కట్టుకున్న వారికి ఐదు లక్షలు ఇస్తానని ఏదైతే హామీ ఇచ్చినారో, దాన్ని ఆమలు చేయాలని, ఈ రోజు జరిగిన ప్రజావాణి లో, అధికారులకు బీఎస్పీ బీఆర్ఎస్ ఎం ఎస్ పి ఎమ్మార్పీఎస్ ., ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది.స్పందించిన అధికారులు వీలైనంత తొందరగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగింది

# శాకంబరీ దేవి అవతారంలో అమ్మవారు

## హనుమాన్ నగర్ లో ఘనంగా బతుకమ్మ వేడుకలు



**పెనుబల్లి సూర్య మేజర్ న్యూస్ :** బియ్యం బంజర్ హనుమాన్ నగర్ లో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గాదేవి అమ్మవారు శాఖాంబరి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం రాత్రి హనుమాన్ నగర్ భక్తులు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలు రకాల కూరగాయలతో అలంకరించిన అమ్మవారు దర్శనమిచ్చి భక్తులకు కనువిందు చేశారు. మహిళా భక్తులు సాంప్రదాయ నృత్యాలతో అలరించారు. భక్తులు చెక్కభజనతో కదం తొక్కారు. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

# కాకతీయుల చరిత్రకు నిలువెత్తు రూపం పాపకొల్లు



మొదటి పేజీ తరువాయి

చల్లని గాలులను ఈ కొండలు అడ్డుకొని ఈ ప్రాంతంలో కొన్ని గంటలలోనే అత్యధిక వర్ష పాతం నమోదు అవుతుంది. చుట్టూ ఎత్తైన కొండలలో కురిసిన వర్షం వివిధ మార్గాలలో ప్రవహించి ఊట వాగు, ఎర్రవాగు, ఎదళ్ళవాగు, తుమ్మల వాగు,పెద వాగు ద్వారా ప్రవహించి ప్రధాన వాగులైన గోధమ వాగు, ముర్రేడు వాగు నుంచి కిన్నెరసాని ద్వారా గోదావరి నదిలో కలుస్తాయి. జూలురుపాడు ఎత్తైన మెరక ప్రాంతం,మైదానం లా కనిపిస్తుంది.మైదానాన్ని హిందీ లో పహడ్ అంటారు. జాలు వారు పహాడ్ కాస్తా జూలురుపహడ్ " జూలురుపాడు"గా నామాంతరం చెంది ఉంటుందని భావించవచ్చు. ఈ ప్రాంతాన్ని కాకతీయులు పరి పాలించారు.రాజధాని ఓరుగల్లు సుమారు 150 కిలో మీటర్ల దూరం వుంటుంది.కాకతీయుల సామ్రాజ్యం ఆంధ్రా ప్రాంతం వరకు వ్యాపించింది.బహుశా ఓరుగల్లు నుంచి బయ్యారం, పాపకొల్లు,జూలూరుపాడు, బెండాలపాడు,వి ఎం బంజర మీదుగా ఆంధ్ర ప్రాంతంలోనికి రహదారి ద్వారా ప్రయాణించినట్లు చారిత్రక ఆధారాలను బట్టి తెలుస్తోంది. ఈ ప్రాంతం లోని పురాతన కట్టడాలను బట్టి కాకతీయుల పరిపాలన కాలం లో పాపకొల్లు గ్రామం ఆనాడు ప్రధాన కేంద్రంగా ఉన్నట్లు చారిత్రక ఆధారాలను బట్టి అంచనా వేయవచ్చు.ఉమాసోమలింగేశ్వర ఆలయం, పుట్టకోట వద్ద సైనిక పటాలం కోసం కోట గోడలు,పోలారం చెరువు,బేతల పాడు వద్ద సోమయ్య లొద్ది, తదితర ప్రాంతాలలో కాకతీయుల ముద్ర సుస్పష్టం. గతంలో పాపకొల్లు చుట్టూ ప్రక్కల ప్రదేశాలలో అప్పుడప్పుడు తవ్వకాలలో నాణేలు, కాకతీయుల పరిపాలనకు సంభందించిన ముద్రలు సైతం లభించినట్టు బోగట్టా. 1213లో కాకతీయుల పరిపాలన ముగిసినట్టుగా చరిత్ర చెబుతోంది. ఇప్పటికీ సుమారు 800 పైచిలుకు సంవత్సరాలు కావస్తున్నది. అంతకుముందు పాపకొల్లు గ్రామం ఏర్పడి ఎంత కాలం అయిందో స్పష్టంగా తెలియనప్పటికీ సుమారు 1000 సంవత్సరాలుగా పావకొల్లు గ్రామ చరిత్రను అంచనా వేస్తున్నారు.ఆ తర్వాత పరిపాలించిన నైజాం ప్రభుత్వంలో సైతం పాపకొల్లు ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. రెవెన్యూ,పోలీస్,వైద్య కార్యాలయాలు ఆనాడే పాప కొల్లు గ్రామంలో కొలువుదీరినట్లు ఆధారాలు ఉన్నాయి. ఆనాడు పోలీస్‌స్టేషన్, రెవెన్యూ కార్యలయం, యునాని అసుపత్రి అక్కడే ఉన్నాయి. ఆనాడు ఇల్లందు కేంద్రంగా తాలూకా సమితి, తహశీల్దార్ కార్యాలయాలు ఉన్నాయి. ఏ పనికైన ఇల్లందు వెళ్ళటానికి చీమలపాడు మీదుగా దగ్గరి దారి ఉంది.ఈ మధ్య కాలంలో ఆ రహదారి అభివృద్ధి కోసం కృషి చేశారు.ఆ రహదారి వాడుకలోకి వస్తే పాపకొల్లు చీమలపాడు ఇల్లందు రవాణా మెరుగుపడుతుంది. కాకతీయ రాజులు ఈ ప్రాంతానికి విచ్చేసినపుడు పుట్టకోట గ్రామంలో సైనిక పహారా లో విశ్రాంతి తీసికొని పోలారం చెరువులో స్నానాదికాలు చేసి పాపకొల్లు ఉమా సోమలింగేశ్వర దేవాలయంలో పూజాదికాలు నిర్వహించే విధంగా నిర్మాణాలను బట్టి ఊహించ వచ్చు. రాజులు ఈ ప్రాంతంలో ఉన్న సమయంలో శత్రు దాడి జరగ కుండా సోమయ్య లొద్ది ప్రాంతంలో ఎత్తైన కొండల పై నుంచి వీక్షిస్తే సూరారం, బెండాలపాడు కనక గిరి కొండల వరకు మార్గంలో దృశ్యం స్పష్టంగా కనిపిస్తుంది. కనకగిరి కొండలలో సైనిక పటాలం



మకాం వేయటానికి అనువైన ప్రాంతం. ఇక్కడ సైతం కాకతీయులు నిర్మించిన "పళ్ళలా బావి" ఉంది, ఎంతో ఎత్తైన ప్రాంతంలో ఉన్నా ఇప్పటికీ నీరు పుష్కలం అంటారు. ప్రక్కనే బెండాలపాడు గ్రామ సమీపంలో వీరభద్రస్వామి ఆలయం నిర్మించారు. ఓరుగల్లు నుంచి బయలు దేరిన రాజులు బయ్యారం, పాపకొల్లు, చంద్రుగొండ ప్రాంతం మీదుగా ఆంధ్ర ప్రాంతంలోని సరిహద్దు వరకు ప్రయాణించే సమయంలో ఈ ప్రాంతాలను సందర్శించి నట్లుగా అవగతం అవుతుంది. కాకతీయులు వారి సామ్రాజ్యంలో ప్రజల నీటి అవసరాలు తీర్చడానికి పెద్ద పీఠ వేశారు. వ్యవసాయానికి గొలుసుకట్టు చెరువులు, త్రాగునీటి కోసం మెట్ల బావులు నిర్మించినట్లుగా అనేక చారిత్రక ఆధారాలు వెలుగులోకి వస్తున్నాయి. వనపర్తి మెట్లబావి, భన్సిలాల్ పేట, ఖమ్మం జాఫర్ బావి ఈ క్రమంలోనే జూలూరుపాడులో నిర్మించిన మెట్ల వుంది. దానిని "రాజాబావి"గా పిలుస్తారు. ఈ బావి రాజు పరివారానికి సాంస్కృతిక కేంద్రంగా భావించవచ్చు. భౌగోళికంగా పరిశీలిస్తే ఈ బావికి దక్షిణం వైపున రెండు గొలుసు కట్టు చెరువులు కప్పలకుంట, శనగ చెరుపు ఉన్నాయి. ఆ పై భాగంలో కొండ ప్రాంతాలతో కూడిన అరణ్యం, అటవీ ప్రాంత మైదానం నుంచి వీచే గాలలు గొలుసుకట్టు చెరుపుల మీదుగా ప్రయాణించి ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. సాయం సంధ్య వేళలో రిక్రియేషన్ క్లబ్(గానా బజానా కేంద్రం)గా ఉన్నట్లు అనిపిస్తుంది. ఈ బావిని పరిశీలిస్తే చతురస్రాకారంలో ఎటు చూసినా 100 అడుగుల పైచిలుకు వైశాల్యం కలిగి ఉంది. దక్షిణం వైపు నుంచి మెట్ల ద్వారా లోపలికి వెళ్ళవచ్చు, రెండు అంతస్తులలో మూడు వైపులా గదులు నిర్మించి ఉన్నాయి. మధ్యలో కోనేరు,లోతుకు వెళ్ళినా కొద్దీ దీని వైశాల్యం చాలా తక్కువగా ఉన్నట్లు,ఈ బావిని ఒక స్త్రీ నిర్మించినట్లుగా ఆనాటి పెద్దలు చెబుతుంటారు. అన్ని కాలలో చల్లని నీరు పుష్కలంగా ఉంటుంది.ఈ బావి ద్వారా త్రాగునీరు, సాగునీరు పుష్కలంగా లభిస్తాయి. సుమారు యాభై ఏళ్ల కిందట రాజా బావి లోతు తెలుసుకోవడానికి అనేక ఇంజన్ మోటర్‌ల ద్వారా నీటిని తోడినప్పటికీ దర దొరకలేదని చెబుతారు. ఆ మధ్యకాలంలో గుప్త నిధులు ఉంటాయనే ఉద్దేశంతో కొందరు శోధించి, తవ్వ టానికి ప్రయత్నించి విఫలమయ్యారని అంటారు. బావి నిర్మాణాలు పటిష్టంగా ఉండటం వలన సాధ్యం కాలేదని ఉపాచ.ఈ బావి పరివాహంలో మంచినీటి కోసం వందల సంవత్సరాల క్రిందట వేరొక బావి తవ్వించారు. కాల క్రమంలో మంచి నీటి బావి శిధిల మైన తరువాత దాని స్థానంలో బోరు నిర్మించారు. బోరులో చల్లని నీరు ఎల్లవేళల పుష్కలం.ఆ నీటిని ఆరోగ్య దాయనిగా భావించి జూలూరుపాడు, వెంగన్న పాలెం,చుట్టు ప్రక్కల గ్రామలలో అనేకమంది క్యూ లైన్ కట్టి రాత్రింబవళ్ళు తారతమ్యం లేకుండా నీటిని ఇప్పటికీ వాడుతున్నారు. నైజాం నవాబ్ పాలనా కాలంలో రాజాబావి ఎంతగానో ఉపయోగ పడినట్లు పెద్దలు వివరించారు. నిజాం ప్రభుత్వ అధికారులు ఈ ప్రాంతానికి విచ్చేసినపుడు ఈ ప్రాంతంలో విడిది చేసేవారు. వారికి సవర్యలు చేసేందుకు గ్రామంలో వివిధ వృత్తులు వేసే వారిని నైజాం అధికారుల విడిది కేంద్రానికి తరలించే వారని ఆనాడు వెట్టి చాకిరి చేసిన కుటుంబాల వారు తెలియ జేశారు. రాజాబావి ఆనుకొని ముస్లిం అవాసాలు వున్నాయి. దీనిని బట్టి చరిత్ర ను అంచనా వేయవచ్చు.దానిని అనుకొని వైశ్యుల వ్యాపార సముదాయాలు వున్నాయి. వ్యాపారం గొప్పగా వర్ధిల్లినట్లు చారిత్రిక ఆధారాలుగా నేటికీ శిథిల భవనాలు సజీవ సాక్ష్యంగా నిలిచాయి.ఆనాడు భద్రాచలం శ్రీ రామ నవమి కి వెళ్ళే భక్తులు రాజా బావి వద్ద వంటలు చేసుకొని సేదతీరే వారని పెద్దలు చెబుతుంటారు. ఎంతో గొప్ప సాంస్కృతిక కేంద్రంగా వర్ధిల్లి,వందల సంవత్సరాల చరిత్రకు సజీవ సాక్ష్యం గా నిలిచి,నేడు ముళ్ళ పొదలు, కంపచెట్లతో శిధిలావస్థలో దయనీయంగా ఉంది. ఖమ్మం కొత్తగూడెం ప్రధాన రహదారి నుంచి రెండు కిలోమీటర్లు దూరం వుంది.వల్లె ప్రకృతి వనం నుంచి 500 మీటర్లు సిసి రోడ్డు నిర్మాణం కలిపితే రాజా బావి వరకు రహదారి సౌకర్యం ఉంటుంది. రాజా బావితో పాటు ఇతర చారిత్రక కట్టడాలను పరిరక్షించి అభివృద్ధి చేసి భావితరాలకు పురాతన వారసత్వ చరిత్రను కానుకగా అందించాలని ప్రజలు కోరుతున్నారు..



## సీతారామాంజనేయ స్వామి సన్నిధిలో చోరీ

కల్లూరు సూర్య మేజర్ న్యూస్ అక్టోబర్ 07 :మేజర్ గ్రామ పంచాయితీ పరిధిలో గల ఖాన్ ఖాన్ పేట గ్రామంలో గల సీతా రామాంజనేయ స్వామి ఆలయ సన్నిధిలో అర్ధరాత్రి సమయంలొ కొందరు దుండగులు స్వామి వారి సన్నిధిలో గల పంచలోహ విగ్రహాలు సీతాదేవి అమ్మవారి మంగళ సూత్రాలు వెండి కళ్ళు అపహరించడం జరిగింది వీటి విలువ సుమారుగా రూ,2 లక్షల రూపాయలు ఉంటాయని అక్కడ నివాసం ఉంటున్న స్థానికులు తెలిపారు.ఇది ఒక్కటే కాకుండ ఇంక అదే ఏరియాలో అనేక దొంగతనాలకు పాల్పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. కాక పోతే ఈ విషయము మాత్రం వెలుగు లోకి వచ్చిందని స్థానికులు చెబుతున్నారు.

## టాస్క్ ఫోర్స్ ,ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్‌లో పట్టుబడి 55 నంబర్ ప్లేట్ లేని వాహనాలు



### నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే కేసులు నమోదు : ట్రాఫిక్ ఏసీపీ

**ఖమ్మం, సూర్య మేజర్ న్యూస్ :** ఉద్దేశపూర్వకంగా నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు తెలిపారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు సోమవారం నగరంలో టాస్క్ ఫోర్స్, ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్ లో నగరంలో నెంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతూ పట్టుబడిన 55 ద్విచక్ర వాహనదారులతో ఏసీపీ టాస్క్ ఫోర్స్ ఏసీపీ మల్లయ్య, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు మాట్లాడి కౌన్సిలింగ్ ఇచ్చారు. అయా వాహనాలను పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఇటీవల కాలంలో చైన్ స్నాచింగ్, దొంగతనాలు చేసే నిందుతులు పోలీసుల నుండి సీసీ కెమెరాల నుండి తప్పించుకునేందుకు ద్విచక్ర వాహనాల నెంబరు ప్లేట్ లను తొలగిస్తున్నారని అన్నారు. అదేవిధంగా చోరి చేసిన వాహనాలతోనే ఎక్కువ నేరాలు చేస్తున్నారని పెర్కొన్నారు. దొంగిలించిన వాహనాలు నకిలీ పత్రాలు సృష్టించి తక్కువ ధరలకు విక్రయిస్తారని, దీనిని దృష్టిలో పెట్టుకొని ఎవరైనా వ్యక్తులు వాహనాలు కొనుగోలు, అమ్మకాలు చేసినట్లతే ఖచ్చితంగా రిజిస్ట్రేషన్ మార్పు చేసుకోవాలని లేదంటే ఎదైనా నేరాలలో మీ వాహనాలు వున్నట్లు గుర్తిస్తే సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించి జరిమానాలు తప్పించుకునేందుకు నెంబర్ ప్లేట్ ను వంచినా, ముగుసు వేసినా, పూర్తిగా లేకుండా చేసిన వారని గుర్తించి వారి వాహనాలు సీజ్ చేసి కేసులు నమోదు ఆవుతాయని అన్నారు. ప్రస్తుతం నంబర్ లేకుండా పట్టుబడిన వాహన పత్రాలు, చాయిస్ నెంబర్లు తనిఖీ చేస్తూ.. చోరికి గురైన వాహనాలు ఏమైనా వున్నాయో లేదో పోలీసులు పరిశీలిస్తునట్లు తెలిపారు. అదేవిధంగా మైనర్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్ పై మరింత దృష్టి పెట్టాలని అన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చినా ఎంవీ యాక్ట్ కింద కేసులను నమోదు చేస్తామని, ఈ సెక్షన్ల కింద నేరం రుజువైతే జైలు శిక్ష, లేదా జరిమానా ఉంటుందన్నారు. ట్రాఫిక్ సిఐ మోహన్ బాబు, టాస్క్ ఫోర్స్ సిఐ రామకృష్ణ, ఆర్ ఐ సాంబశివరావు ఎస్సై రవి, సాగర్, రాము పాల్గొన్నారు.



## కోటమైసమ్మ జాతర ఏర్పాట్లను పరిశీలించిన ఏసీపీ,సిఐ సింగరేణి సర్కిల్



**సింగరేణి సూర్య మేజర్ న్యూస్ :** సింగరేణి (కారేపల్లి అక్టోబర్ 07) మండలం దసరా సందర్భం గా కారే పల్లి మండలంలో ఉసిరికాయలపల్లి లోని శ్రీకోటమైసమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో ఈనెల 12వ తేది నుంచి 5 రోజుల పాటు నిర్వహించే కోటమైసమ్మ తల్లి జాతర కు ఏర్పాట్లనుఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి పరిశీలించారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ జాతరకు వేలాది మంది భక్తులు హాజరవుతారు.కోటమైసమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకోవటంతో పాటు భక్తులు జాతరలో ఏర్పాటు చేసిన వినోదాత్మక కార్యక్రమాలలో పాల్గంటారు. జాతర కు కారేపల్లి, ఇల్లందు, సీతారాంపురం మూడు మార్గాల ద్వారా భక్తులు జాతరకు కదిలి వస్తుంటారు. ఈసందర్భంగా వాహనాల రద్దీతో ప్రతి ఏటా ట్రాఫిక్‌కు అంతరాయం కల్గుతుంది. దీనిపై ఏసీపీ సమీక్షించారు. జాతరలో దుకాణాల ఏర్పాట్లు వినోద సాధనాల ఏర్పాట్లపై ఆలయ చైర్మన్ డాక్టర్ పర్సా పట్టాభి రామారావు, ఈవో కొండకింది వేణుగోపాలాచార్యులు తో చర్చించారు. జాతరలో ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేయటం జరుగుతుందని ఏసీపీ తెలిపారు. జాతరలో వాహనాల పార్కింగ్‌కు అల్యాతండా వద్ద 5 చోట్ల ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.ఏసీపీ వెంట సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి,ఎస్సై ఎన్.రాజారాం, ఆలయ సిబ్బంది పగడాల మోహన్ కృష్ణ, పర్సా సాయి తదితరులు ఉన్నారు.